పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి అండ



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగ పడుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ మారతీనగర్ కు చెందిన సురేష్‌కు గుండె ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. అయితే, అతని ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కలిశారు. ఆపరేషన్‌కు అయ్యే ఖర్చుల వివరాలతో ముఖ్యమంత్రి సహాయనిధికి ఆయన దరఖాస్తు చేయించారు. రూ. లక్షా 50 వేలను మంజూరు చేస్తూ సీఎం సహాయ నిధి నుంచి ఎల్ఓసీ మంజూరైంది. దానిని గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు. పేద ప్రజలు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటోందని ఆయన అన్నారు.

వనస్థలిపురంలో డాక్టర్ శ్రీస్ క్లినిక్ ప్రారంభం



డాక్టర్ శ్రీస్ క్లినిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డాక్టర్ సోనియా

వనస్థలిపురం: వనస్థలిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ శ్రీస్ క్లినిక్‌ను గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శ్రీస్ క్లినిక్ ఎండీ డాక్టర్ సోనియా మాట్లాడుతూ, హోమియోస్థెటిక్స్‌తో హైదరాబాద్‌లో తమది మొదటి క్లినిక్ అని అన్నారు. హోమియోపతి కాస్మోటాలాజికల్ ట్రీట్‌మెంట్‌తో కలిపి చర్మానికి హోమియా మెరుగ్గా పని చేస్తుందన్నారు. చర్మ, జుట్టు చికిత్సలను తమ క్లినిక్‌లో అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీస్ క్లినిక్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు: డీసీ

ఎల్‌బీనగర్: రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్ణీత చెత్త డంపింగ్ పాయింట్ల వద్ద లేదా రిక్షాల్లోనే చెత్తను వేయాలని సరూర్‌నగర్ సర్కిల్ డీసీ సుజాత అన్నారు. సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న కూరగాయల సంతల వద్ద వ్యాపారులు కుళ్లిన కూరగాయలు, ఇతర వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీసీ సుజాత గురువారం సరూర్‌నగర్ స్టేడియం వద్ద కూరగాయాల వ్యాపారులతో మాట్లాడారు. రోడ్లపై కూరగాయలు వేస్తే జరిమానాలు విధిస్తామని ఆమె హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించండి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ డీసీకి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆమె ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానాను కార్యాలయంలో కలిసి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను వివరించారు. కార్పొరేటర్ వినతికి స్పందించిన డీసీ సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

శివరాత్రికి బందోబస్తు ఏర్పాటు చేయండి

చైతన్యపురి: శివరాత్రి వేడుకలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయ ఫౌండర్ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం వారు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వి.సైదిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. శివరాత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని వారు ఇన్‌స్పెక్టర్‌ను ఆహ్వానించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు బాలరాజు, రాములు, పెద్దిరాజు, రవినాయక్, పెంటయ్య, వేణు, యాదయ్య, సర్కిల్, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

చింతల్‌బస్తీలో 'కార్డెన్ సెర్చ్'

సైదాబాద్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తరచూ కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ టి.స్వామి తెలిపారు. సౌత్‌ఈస్ట్ జోన్ పోలీసుల బృందం అడిషనల్ డీసీపీ టి. స్వామి పర్యవేక్షణలో గురువారం సాయంత్రం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌బస్తీలో పోలీసు తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో గుర్తింపు పత్రాలు లేని 12 వాహనాలు, అక్రమంగా ఒకరి ఇంట్లో నిల్వ చేసిన 45 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఆరుగురు పాత నేరస్తులను గుర్తించి పోలీసులు వారికి కౌన్సిలింగ్ చేశారు. సోదాల్లో నలుగురు ఏసీపీలు, 10 మంది ఇన్‌స్పెక్టర్‌లు సహా 220 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవేంద్ర మఠానికి సుబుదేంద్ర తీర్థ స్వామిజీ రాక

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని అలకాపురి శ్రీ రాఘవేంద్రస్వామి మృత్తికా బృందావన ప్రతిష్ఠాపన రజతోత్సవాల్లో పాల్గొనేందుకు మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థ శ్రీపాదులు గురువారం రాత్రి విచ్చేశారు. ఈ సందర్భంగా కొత్తపేట వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయం వద్ద శ్రీపాదులకు స్వాగతం పలికి పురవీధుల గుండా అలకాపురిలోని శ్రీ రఘవేంద్ర స్వామి మఠం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. మఠంలో స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ టికెట్ మైనారిటీలకు ఇవ్వాలి

చాదర్‌ఘాట్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ టికెట్‌ను బీఆర్ఎస్ నాయకత్వం మైనారిటీలకు కేటాయించాలని పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ లాయక్‌అలీ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం మాజీ హోంమంత్రి మహమూద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పార్టీ అధ్యక్షుడితో చర్చించి తనకు టికెట్ కేటాయించాలని ఆయన కోరారు. ముస్లింలు ఎప్పుడూ పార్టీకి అండగా ఉన్నారని, అందు వలన రానున్న ఎన్నికల్లో ముస్లింలకు రెండు ఎంపీ స్థానాలు ఇవ్వాలని ఆయన అన్నారు. తనకు హైదరాబాద్ టికెట్ కేటాయిస్తే పార్టీ నాయకులు, కార్యకర్తలందరి సహకారంతో విజయం సాధిస్తానని అన్నారు.

తండ్రి చనిపోయాడని కుమార్తె ఆత్మహత్య



కీర్తన మృతదేహం

నాగోలు: తండ్రి చనిపోయాడని మనస్తాపంలో కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం ప్రకారం..మన్సూరాబాద్ సాయి సప్తగిరి కాలనీకి చెందిన బాసాని సునీతకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సునీత భర్త శ్రీనివాస్ గత డిసెంబర్‌లో మృతి చెందాడు. కుమార్తె కీర్తన(20) ఇంటి వద్దనే ఉంటోంది. గురువారం ఉదయం సునీత పని మీద బయటకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో సునీత ఇంటి తిరిగి వచ్చేసరికి తలుపులు వేసి ఉన్నాయి.దీంతో కుమార్తెకు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో కిటికీ అద్దం పగులగొట్టి చూడగా, కీర్తన చున్నీతో సీలింగ్‌కు ఉరేసుకొని కనిపించింది. స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి కీర్తనను కిందకు దించి చూడగా అప్పటికే చనిపోయి ఉంది. తండ్రి చనిపోయాడని మనస్తాపంతో కీర్తన ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని తల్లి సునీత పోలీసులకు తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



అన్నదానం

శ్రీశైలంలో గురువారం అన్నదానం చేస్తున్న సైదాబాద్ భాగ్యనగర్ కాలనీకి చెందిన శివదీక్ష సేవా సమితి సభ్యులు.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

వేడుకలకు ముస్తాబైన ఆలయాలు



మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని ఉమానాగలింగేశ్వర ఆలయం



హస్తినాపురం ద్వారకానగర్‌లోని భవానీ రామలింగేశ్వర ఆలయంలోని శివలింగం



అక్బర్‌బాగ్ పల్టాన్‌లోని శ్రీహరిహరక్షేత్రం

వనస్థలిపురం/దిల్‌సుఖ్‌నగర్: మహాశివరాత్రికి అంతటా సర్వం సిద్ధమైంది.ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలోని శైవాలయాలను రకరకాలు పూలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, మహాశివునికి పంచామృత అభిషేకాలు, కల్యాణం, సాయంత్రం స్వామివారి ఊరేగింపు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో సామూహిక క్షీరాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయా ఆలయాల పాలకమండలి సభ్యులు తెలిపారు.

- వనస్థలిపురం ఫేజ్-1లోని భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారి ముందు ఏర్పాటు చేసిన శివలింగానికి శుక్రవారం ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులచే సామూహిక పంచామృత అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి 9 నుంచి 11 గంటల వరకు శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివారి కల్యాణ మహోత్సవం, రాత్రి 11 నుంచి 11.30 వరకు స్వామివారికి పల్లకి సేవ, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో సామూహిక క్షీరాభిషేకం నిర్వహిస్తున్నారు.
- హస్తినాపురం ద్వారకానగర్‌లోని భవానీ రామలింగేశ్వర సహిత అభయాంజనేయ ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి రుద్రాభిషేకం, 6 నుంచి భక్తులచే సామూహిక అభిషేకాలు, 10 గంటల నుంచి అఘోర పాశుపత హోమం, సాయంత్రం 7.30 నుంచి శివపార్వతుల కల్యాణం, లింగోద్భవ అభిషేకాలు, అఖండ శివ నామ స్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.
- మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 5 నుంచి రుద్రాభిషేకాలు, 11 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగోద్భావ కాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. శనివారం ఉదయం ఉమామహేశ్వరుల కల్యాణ మహోత్సవం, ఉపవాస దీక్ష విరమించుకున్న భక్తులకు అన్నదానం చేస్తామని ఆలయ ఫౌండర్ ట్రస్టీ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు
- సహారాస్టేట్స్ కాలనీలోని లలితా నాగ నాగలింగేశ్వరాలయం, నాగోలు డివిజన్ పరిధిలోని సౌత్ ఎండ్‌పార్కు కాలనీలో శివాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- హయత్‌నగర్ పరిధిలోని వీరన్నగుట్టపై ఉన్న భద్రకాళీ రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం గుట్టను చదును చేసి షామియానాలు వేయించారు.

పెరిగిన పూలు, పండ్ల ధరలు :

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని ప్రధాన చౌరస్తాలు పండ్లు, పూలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వ్యాపారులు సాధారణ రోజుల్లో కన్నా మూడింతల అధిక ధరలకు విక్రయించారు. మహాశివరాత్రికి పూజ, ఉపవాసం కోసం ఉపయోగించే ఖర్జూరాలు కిలో రూ.95 నుంచి 120, పుచ్చకాయలు ఒక్కింటికి రూ. 40-65 వరకు, ద్రాక్ష కిలో రూ. 60-120 వరకు, అరటిపండ్లు డజను రూ.45 నుంచి 55, ఆపిల్ ఒకటి రూ.20-25 వరకు, ఖర్బూజ కిలో రూ.40కి విక్రయిస్తున్నారు. వీటితో పాటు పూలు కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంపై నిజనిర్ధారణ కమిటీ వేయాలి

జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు



చీఫ్ ఇంజినీర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: మలక్‌పేట ఫైర్‌స్టేషన్ నుంచి సైదాబాద్ ప్రధాన రహదారి మీదుగా సంతోష్‌నగర్ వరకు నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంలో అవకతవకలపై నిజనిర్ధారణ కమిటీ వేసి వాస్తవాలు వెలికి తీయాలని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కాంగ్రెస్ నాయకులతో వెళ్లి జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ మహ్మద్ జియాఉద్దీన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్టీల్‌బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి మూడేళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు ఇంకా సాగుతూ ఉండటానికి కారణాలు ఏంటని ప్రశ్నించారు. స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం పైనుంచి వెళ్లేలా ఎలా నిర్మిస్తారని అన్నారు. అన్ని మతాల వారి విశ్వాసాలను గౌరవించాలని, ఎవరి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించవద్దని ఆయన అధికారులను కోరారు. వెంటనే స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం అలైన్‌మెంట్‌ను మార్చాలని అన్నారు. అధికారులు ఈ విషయంలో సానుకూలంగా స్పందించకుంటే సమస్య తీవ్రతను తాము దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు మామిడి కృష్ణకుమార్, నగేష్ సింగ్, ఉజ్మా షాకీర్, చలం, సుల్తాన్ మీర్జా, విజయ్‌కుమార్, అర్షాద్‌అలీ, కోట్ల లడ్డూ పటేల్ పాల్గొన్నారు.

'హైదరాబాద్'లో బీజేపీ విజయం ఖాయం: సంరెడ్డి



బీజేపీ అభ్యర్థి మాధవీలతను సన్మానించిన సురేందర్‌రెడ్డి

సైదాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత విజయం సాధించడం ఖాయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం బీజేపీ అభ్యర్థి మాధవీలత సైదాబాద్‌లో పర్యటించి స్థానిక బీజేపీ ప్రముఖులను కలుసుకున్నారు. తమ నివాసానికి వచ్చిన ఆమెకు సంరెడ్డి సురేందర్‌రెడ్డి సాదర స్వాగతం పలికి కుటుంబ సభ్యులతో కలిసి శాలువా సన్మానించారు. అనంతరం మాధవీలత మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డిలను వారి నివాసాలకు వెళ్లి కలుసుకున్నారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరితో కలిసి ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా మాధవీలత తెలిపారు.

బీజేపీ గెలుపునకు కృషి

మలక్‌పేట: బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మాధవీలతను గురువారం మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ స్థానం కైవసం చేసుకునేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఆమె సూచించారు. పార్టీ నేతలు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కొప్పుల దినేష్, గజానంద్, సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. మహిళలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.



వేడుకల్లో పాల్గొన్న వాసవి క్లబ్ వనిత సభ్యులు

మన్సూరాబాద్: హరిణి వనస్థలి జాతీయ పార్కు మన్సూరాబాద్ గేట్ వద్ద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. మహిళా వాకర్స్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

- పనామా చౌరస్తా సమీపంలోని స్పందన డిగ్రీ, పీజీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.వీరమణి, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేస్ మహిళా డిగ్రీ కళాశాలలో....

హస్తినాపురం: మహిళా దినోత్సవం సందర్భంగా రేస్ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల డైరెక్టర్ హరిణి గిరిధర్ ప్రిన్సిపాల్ నిహారికలను మహిళా ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు.

లింగోజిగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించడం ఎంతో సంతోషకరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లింగోజిగూడ డివిజన్ శాతవాహనగర్ కాలనీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం వివిధ రకాల వస్తువులతో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని స్టాళ్లలోని వస్తువులను పరిశీలించారు.

మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీలోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సత్యం, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయంలో....

హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో...

సాక్షి, సిటీబ్యూరో: వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో గురువారం ప్రశాంత్ నగర్ ఎఫ్‌సీఐ కాలనీలోని సీనియర్ సిటిజన్ హాల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆటలు, పాటల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యక్షుడు సత్యశ్రీ, కార్యదర్శి రుద్రంగి విజయ, కోశాధికారి మంచి సవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్: డివిజన్ పరిధిలోని మనోహర్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో బీజేపీ మజ్దూర్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.



శాతవాహనగర్‌లో.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హరిణి వనస్థలి జాతీయ పార్కులో...

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

ఎల్‌బీనగర్: కాలనీ వాసులకు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఏపీఆర్ క్రిస్టల్ అవెన్యూ వద్ద జరుగుతున్న వరద నీటి కాలువ పనులను పలు కాలనీల వాసులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జక్కిడి కాలనీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సౌభాగ్యనగర్ కాలనీ అధ్యక్షుడు నందకిషోర్, బ్యాంక్ కాలనీ అధ్యక్షుడు లక్ష్మీపతి, నాయకులు విష్ణువర్ధన్, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

నాగోలు: జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భం కొత్తపేటలోని మానస మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎస్‌కేఎస్ అరవింద్, డాక్టర్ అనిరుధ్ మాథుర్, డాక్టర్ సిరి చందన తమ సిబ్బందితో కలిసి శిబిరం నిర్వహించారు. దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలోని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణ గురించి వారికి ప్రత్యేక సూచనలు అందజేశారు. మానస డైరెక్టర్ మెర్సీ మధురిమ, ప్రిన్సిపాల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఓఎస్‌డీకి సన్మానం



దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి ఓఎస్‌డీగా నియమితులైన వేముల శ్రీనివాస్‌ను గురువారం ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అష్టలక్ష్మి ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, నగుమల శ్రవణ్‌కుమార్, అయిత అంజయ్యగుప్తా, ఉమాపతి తదితరులు ఉన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

చైతన్యపురి: తాళం విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడ్డ ఓ ఆగంతకుడు బీరువాలోని మూడున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం...టెలిఫోన్ కాలనీ రోడ్ నంబర్-1లో ప్రైవేట్ ఉద్యోగి జయప్రకాష్ అద్దెకు ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన భార్య రాజేశ్వరి ఇంటికి తాళం వేసి సమీపంలోని పాఠశాలకు వెళ్లి లంచ్ బాక్స్ ఇచ్చి.. అటు నుంచి మార్కెట్‌కు వెళ్లింది. గంట తర్వాత ఇంటికి వచ్చి చూడగా తాళం విరగ్గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు కమ్మలు, చిన్న వస్తువులు మొత్తం 3.5 తులాల ఆభరణాలు కనిపించలేదు. చోరీకి గురైనట్టు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని గుర్తించేందుకు కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

చైతన్యపురి: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చైతన్యపురి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పాండుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు జిల్లాకు చెందిన శశికుమార్(25), మనీషా భార్యాభర్తలు. కొత్తపేటలో ఉండే వీరికి ఒక కుమార్తె ఉంది. శశికుమార్ కూలీ పనులు చేస్తుంటాడు. గత కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నాలుగు రోజుల క్రితం భర్తతో గొడవ జరగడంతో మనీషా పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న శశికుమార్ ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన పక్కింటి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.